www.akshratimes.com

తెలుగు దినపత్రిక

అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

ప్రకాశం

ఆదివారం | 04 ఆగస్టు | 2024 | పేజీలు 4

# నేడు ఇంకొల్లులో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

## పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు




**అక్షర టైమ్స్, ఇంకొల్లు :** ఇంకొల్లు జిల్లా పరిషత్ హైస్కూలులో ఆదివారం ఏలూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. బిపి, షుగర్, రక్త పరీక్షలు ఉచితంగా చేస్తారని, కంటి వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు కూడా చేయడం జరుగుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు , అభిమానులు పెద్దఎత్తున పాల్గొని వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# శ్రీశైలంలో ఆశాజనకంగా.. విద్యుత్ ఉత్పత్తి

- రైతులకు 9 గంటల పాటు నిరంతర విద్యుత్ సరపరా
- ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి ఇంటికీ త్రాగునీరు అందిస్తాం
- అద్దంకి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తా

## రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అక్షర టైమ్స్, జె.పంగులూరు :** మండలంలోని ముప్పవరం గ్రామంలో గల తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శనివారం నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని పారదర్శక పాలనతో మళ్లీ గాడిలో పెట్టడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గ్రామాల్లో సుపరిపాలన అందించేందుకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు, ప్రజలు పలు సమస్యల్ని మంత్రి దృష్టికి తీసుకురావడంతో పరిష్కారం దిశగా సంబంధిత అధికారులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం అప్పుల పాలు అయిపోయిందన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించకుండా రుషికొండ ప్యాలెస్ లాంటి ఎవరికీ ఉపయోగపడని నిర్మాణాలకు జగన్‌రెడ్డి వందల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టారని ధ్వజమెత్తారు. సాగర్ కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు ముఖ్యమంత్రితో చర్చించి నీటిని విడుదల చేసేలా చర్యలు చేపడతామన్నారు. శ్రీశైలం జలాశయానికి వరద నీరు చేరటంతో విద్యుత్ ఉత్పత్తి ఆశాజనకంగా ఉందని, రైతులకు వ్యవసాయానికి 9 గంటల నిరంతర విద్యుత్ అందించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందని స్పష్టం చేశారు. ప్రజలకు యుద్ధ ప్రాతిపదికన సాగునీరు, త్రాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# ఉద్యానవన పంటల సాగుకు ప్రోత్సాహం

## ఒంగోలు జాతి ఆవుల సంరక్షణకు చర్యలు - జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా







**అక్షర టైమ్స్, నాగులుప్పలపాడు :** నాగులుప్పలపాడు మండలంలో శనివారం జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా విస్తృతంగా పర్యటించారు. తొలుత మద్దిరాలపాడు గ్రామాన్ని సందర్శించి జామ, సీతాఫలం పంటలను సాగుచేస్తున్న కాటా శేషయ్య, భైరపు రమాదేవిలకు సంబంధించిన పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఉద్యానవన పంటల సాగుకు 2018-19 సంవత్సరంలో డ్రిప్ ఇరిగేషన్ స్కీమ్ కింద యూనిట్‌కు రూ.61,711లు ప్రభుత్వం మంజూరు చేయగా, అందులో సబ్సిడీ కింద రూ.46,108లు పోను రైతు వాటాగా రూ.15 ,603లు చెల్లించడం జరిగిందని ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణ కలెక్టర్ కు వివరించారు. డ్రిప్ ఇరిగేషన్ విధానంలోనే రైతులు జామ సాగు చేస్తున్నారని తెలిపారు. ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గోపీచంద్ కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో ఉద్యాన పంటలను మరింతగా ప్రోత్సహించడంతో పాటు ఆర్గానిక్ పంటల వైపు రైతులను సమాయత్తం చేయాలని కలెక్టర్ అధికారులకు



సూచించారు. అనంతరం చదలవాడలోని పశు ఉత్పత్తి క్షేత్రాన్ని సందర్శించారు. ఒంగోలు జాతి ఆవుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి ఉప సంచాలకులు రవి కుమార్ కలెక్టర్‌కు తెలియజేశారు. పశు క్షేత్రంలో విభాగాల వారీగా పశు సంరక్షణకు చేపడుతున్న పనులను, పశు గ్రాసం సాగును కలెక్టర్ పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పశు ఉత్పత్తికి తీసుకుంటున్న చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంట జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ బేబీరాణి, పశు క్షేత్ర వైద్యులు ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల సందడి

## 8న ఎస్ఎంసీ ఎన్నికలు - షెడ్యూల్ విడుదల - ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

**అక్షర టైమ్స్, యర్రగొండపాలెం :** ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్ కమిటీల ఎన్నికలకు ఏపీ సమగ్ర శిక్ష అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. ఈనెల 8న నూతన కమిటీలకు ఎన్నికలు నిర్వహించేలా విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. మండలంలో 10 యూపీ పాఠశాలలు, 12 హైస్కూళ్లు, 57 ప్రాథమిక పాఠశాలలు కలిపి మొత్తం 79 పాఠశాలల్లో ఎన్నికలు జరుగనున్నాయి. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యా హక్కులోని సెక్షన్ 21 ప్రకారం ఈ విద్యా కమిటీలను ప్రభుత్వం నియమించాల్సి ఉంది. గత ప్రభుత్వం బడుల్లో ఏర్పాటుచేసిన పేరెంట్స్ కమిటీల పదవీకాలం ఈ ఏడాది జూలై లో ముగిసింది. కొత్తగా పేరెంట్స్ కమిటీల స్థానంలోనే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలుగా పేరు మార్చి ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

### పాఠశాల యూనిట్‌గా..

పాఠశాల యూనిట్‌గా ఎన్నికలు జరుగుతాయి. ఆయా పాఠశాలల్లో ఒక్కో తరగతి నుంచి ముగ్గురు తల్లిదండ్రులను సభ్యులుగా ఎన్నుకుంటారు. ప్రాథమిక పాఠశాలల్లో 15 మంది, యూపీ స్కూలులో 21 మంది, హైస్కూలులో 24 మంది సభ్యులను ఎన్నుకుంటారు. ఇందులో ఆరుగురు ఎక్స్ ఆఫీషియో, ఇద్దరు కో ఆప్షన్ సభ్యులు ఉంటారు. ఎన్నికలు పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో జరుగుతాయి.

### ఎన్నికల షెడ్యూల్..

ఈనెల 1న ప్రతి పాఠశాల నోటీస్ బోర్డులో ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ ప్రదర్శించారు. ఓటర్ల జాబితాను నోటీసు బోర్డులో ఉంచారు. 5వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. సమస్యలు ఉంటే పరిష్కరిస్తారు. అదే రోజు సాయంత్రం 4 గంటలలోపు తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారు. 8న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సభ్యులకు ఎన్నికలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు కమిటీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్లతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. 3 గంటలకు నూతన ఎస్ఎంసీ తొలి సమావేశం నిర్వహించేలా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.



### మార్గదర్శకాలు..

ఎన్నికల నిర్వహణకు కనీసం 50 శాతం తల్లిదండ్రులు, సంరక్షకులు హాజరు కావాలి. కోరం ఏర్పడటానికి సమయ పరిమితిని ప్రధానోపాధ్యాయులు నిర్ణయిస్తారు. ఎన్నికలు చేతులను ఎత్తడం ద్వారా లేదా నోటితో చెప్పడం ద్వారా నిర్వహించబడతాయి. అపరిష్కృత వివాదాలు, అసాధారణ పరిస్థితుల్లో రహస్య బ్యాలెట్ విధానాన్ని అవలంభించవచ్చు. విద్యార్థి తల్లిదండ్రులలో ఒకరు మాత్రమే ఓటు వేయడానికి అర్హులు. వివిధ తరగతుల్లో పిల్లలు ఉంటే వారి తల్లిదండ్రులు ఆయా తరగతి ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడానికి అర్హులే. ఎస్ఎంసీలో ఎన్నికైన సభ్యుల నుంచి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవాలి. వీరిలో కనీసం ఒకరు వెనుకబడిన సమూహం లేదా బలహీన వర్గాలకు చెందిన పిల్లల తల్లిదండ్రులై ఉండాలి. వారిలో కనీసం ఒకరైనా మహిళ ఉండాలి. ఒకసారి ఏర్పాటుచేయబడిన ఎస్ఎంసీ రద్దు లేదా విలీనం వరకు శాశ్వతంగా ఉనికిలో ఉంటుంది. ఈ ఎన్నికల ప్రక్రియలో అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. తహసీల్దార్, ఎంపీడీఓ, గ్రామ కార్యదర్శి, వీఆర్వో, వీఆర్ఏలు ఎన్నికల ప్రక్రియలో వరిశీలకులుగా పాల్గొనవచ్చు. ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా ప్రజాప్రతినిధులు, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎం, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉంటారు. కో-ఆప్షన్ సభ్యులుగా గ్రామాభివృద్ధి వార్డు కమిటీ నుంచి ఇద్దరు ఉన్నత విద్యావంతులు లేదా విశ్రాంత ఉద్యోగులకు అవకాశం కల్పించాలి.



ఎన్నికలు పకడ్బందీగా నిర్వహిస్తాం
మల్లూ నాయక్, ఎంఈఓ- 2, యర్రగొండపాలెం

మండలంలోని 79 ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలను నిర్వహిస్తాం. సమగ్ర శిక్ష అధికారులు జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి ప్రతి పాఠశాలలో ప్రకటించిన షెడ్యూల్ మేరకు ఎన్నికలు నిర్వహించేలా సంబంధిత పాఠశాలలకు ఆదేశాలిచ్చాం.



## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### యర్రగొండపాలెం పంచాయతీ కార్యదర్శి ఈదుల రాజశేఖర్‌రెడ్డి

**అక్షర టైమ్స్, యర్రగొండపాలెం :** యర్రగొండపాలెం మేజర్ పంచాయతీలో దోమలు ఎక్కువ కావడంతో ప్రజలు సీజనల్ వ్యాధులు బారినపడుతున్నారు. దోమల నిర్మూలనకు ముందస్తు చర్యల్లో భాగంగా శనివారం పంచాయతీ కార్యదర్శి ఈదుల రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రామావత్ అరుణాబాయిలు పట్టణంలోని మెయిన్ బజార్, పురవీధుల్లో ఫాగింగ్ చేపట్టారు. వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈదుల రాజశేఖర్‌రెడ్డి సూచించారు. వ్యాపార సంస్థలు, ఇండ్లలోని వ్యర్థాలను పంచాయతీ వారు ఇచ్చిన తడి, పొడి డబ్బాలలో నిల్వ ఉంచి ప్రతిరోజూ తమ ఇంటి వద్దకు వచ్చే చెత్త డబ్బాలో పడేయాలని తెలిపారు. అలా చేయకుండా రోడ్లపైన, డ్రైనేజీ కాలువలలో చెత్త వేస్తే దుర్వాసన రావడంతో పాటు దోమలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా వ్యాధులు ప్రబలుతాయన్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ వ్యాధులు సోకకుండా చూసుకోవాలని తెలిపారు.

## తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం




**అక్షర టైమ్స్, యర్రగొండపాలెం :** తల్లిపాలు వారోత్సవాలలో భాగంగా శనివారం యర్రగొండపాలెం పట్టణంలోని ఇందిరానగర్ అంగన్వాడీ కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి.రేణుక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్తీలేని తల్లిపాల విలువను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. తల్లి పాల ప్రయోజనాలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని చెప్పారు. బిడ్డకు రెండు సంవత్సరాల వయస్సు వచ్చేంత వరకు తల్లిపాలు ఇవ్వవచ్చునని తెలిపారు. ముర్రుపాలలో బిడ్డకు ఉపయోగపడే అనేక పోషక విలువలు, వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ సీహెచ్ స్వర్ణలత, సీహెచ్ లక్ష్మీకుమారి, అంగన్వాడీ వర్కర్లు ఉషారాణి, దుర్గమ్మతో పాటు గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

## తల్లిపాలు ముద్దు - డబ్బా పాలు వద్దు



**అక్షర టైమ్స్, యర్రగొండపాలెం :** తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని, సంపూర్ణ ఆహారమని మండలంలోని కొత్త గోళ్లవిడిపి అంగన్వాడీ కార్యకర్త పూజల మూర్తెమ్మ అన్నారు. సీడీపీఓ పద్మావతి, బోయలపల్లి సెక్టార్ సూపర్ వైజర్ కేవీ సుబ్బమ్మల ఆదేశాల మేరకు శనివారం అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన మొదటి గంటలో పసుపు రంగులో ఉండే తల్లి ముర్రుపాలు బిడ్డకు మంచి ఆరోగ్యాన్నిస్తాయన్నారు. వీటిలో బిడ్డకు అవసరమైన అన్ని పోషకాలు ఉంటాయనీ, అలాగే వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని చెప్పారు. బిడ్డకు ఆరు నెలలు తల్లిపాలే సంపూర్ణ ఆహారమన్నారు. ఆరు నెలలు దాటిన తరువాత తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం కూడా ఇస్తారని తెలిపారు. తల్లిపాలు శిశువును న్యూమోనియా, అతిసార వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుంచి కాపాడతాయని, పిల్లల మేధస్సును మెరుగు పరచడంలో సహాయపడతాయన్నారు. గర్భవతులు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. అనంతరం తల్లిపాలు ముద్దు-పోత పాలు వద్దు.. ముర్రుపాలు ముద్దు -డబ్బా పాలు వద్దు అని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వి.రాజేష్, ఏఎన్ఎం పుల్లమ్మ, అంగన్వాడీ ఆయా ఎస్. నాగేశ్వరి, ఆశ వర్కర్ సారమ్మ తదితరులు పాల్గొన్నారు.





# తిరుమలగిరి కాలనీలో ఉచిత వైద్య శిబిరం

**అక్షర టైమ్స్, యర్రగొండపాలెం :** యర్రగొండపాలెం పంచాయతీ పరిధిలోని తిరుమలగిరి కాలనీలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మార్కాపురం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.బాలాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు చైతన్యవంతులు కావాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఏదైనా న్యాయ సహాయం కావాలంటే మండల న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించాలని చెప్పారు. అనంతరం వెంకటాద్రిపాలెం, పాలుట్ల వైద్యాధికారులు డాక్టర్ వి.కోటా నాయక్, డాక్టర్ సయ్యద్ నాయబ్ రసూల్, డాక్టర్ పి.చంద్రశేఖర్, డాక్టర్ వెంకటేశ్వర్లు నాయక్, ఏరియా వైద్యశాల వైద్యులు డాక్టర్ మనోజ్ ఖన్నా బాలింతలకు, గర్భవతులకు, చిన్నారులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.పద్మావతి, తహసీల్ధార్ ఉప్పలపాటి విజ య భాస్కర్, ఎంపీడీఓ వైవీ నాగేశ్వర ప్రసాద్, సీడీపీఓ పద్మావతి, సార్ట్స్, ఆర్డీటీ సంస్థ ప్రతినిధులు, వైద్య సిబ్బంది, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.





## వరి సాగులో రైతులు మెళకువలు పాటించాలి

### గిద్దలూరు ఏడీఏ బాలాజీ నాయక్

**అక్షర టైమ్స్, రాచర్ల:** వరి సాగుచేసే రైతులు మెళకువలు పాటించాలని గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీ నాయక్ అన్నారు. మండలంలోని అనుములపల్లి గ్రామంలో సాగుచేస్తున్న వరి నారుమళ్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ వరి నారు పోసిన 15 నుంచి 20 రోజుల లోపల ఇనుప దాతు లోపం ఎక్కువగా గమనించడం జరుగుతుందన్నారు. ఈ లోపం వల్ల ఆకుల కొసలు తెల్లగా వస్తాయన్నారు. దాని నివారణకు ఫైరస్ సల్ఫేట్ 12 శాతం, ఈడీటీఏ 1 గ్రాము లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. అలాగే వరి నారు ప్రధాన పొలంలో నాటే ముందు కొసలు తుంచి నాటడం వల్ల కాండం తొలిచే పురుగులను నివారించవచ్చన్నారు. ఏమైనా సమస్యలు తలెత్తితే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## హజ్ యాత్రకు వెళ్లి వచ్చిన షకీల్ అహ్మద్‌ను కలిసిన ముస్లీం వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు



**అక్షర టైమ్స్, వేటపాలెం :** ఆంధ్రప్రదేశ్ ముస్లీం వెల్ఫేర్ అసోసియేషన్ యూత్ అధ్యక్షులు బాణం బీడీ కంపెనీ అధినేత షకీల్ అహ్మద్ హజ్ యాత్ర పూర్తి చేసుకుని వచ్చిన సందర్భంగా వేటపాలెంలోని ఆయన కార్యాలయంలో శనివారం రాష్ట్ర అధ్యక్షులు షేక్ రఫీ, ప్రధాన కార్యదర్శి షేక్ మీర్సాబాబులు మర్యాదపూర్వకంగా కలిశారు. షకీల్ అహ్మద్ మక్కా నుంచి వివిధ రకాల ఖర్జూరపు పండ్లతో వారికి విందు ఏర్పాటుచేశారు. అనంతరం ఇద్దరు రాష్ట్ర నాయకులకు జానీమాజ్ ఖర్జూరం, అత్తార్, జంజం పానీ సీసాలు ఉన్న కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఒకటవ పట్టణ యూత్ అధ్యక్షులు ఇబ్రహీం, వేటపాలెం కమిటీకి చెందిన సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## పొట్లూరి గిరీష పుట్టినరోజు సందర్భంగా.. అమ్మ ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం



**అక్షర టైమ్స్, మార్టూరు :** అమెరికాలో నివసిస్తున్న పొట్లూరి గిరీష పుట్టినరోజు సందర్భంగా హైదరాబాదుకు చెందిన ఆమె తల్లిదండ్రులు కిలారు రవీంద్రబాబు – రాజ్యలక్ష్మి దంపతులు శనివారం మార్టూరులోని అమ్మ ఆశ్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షురాలు జాష్టి అనురాధ, కార్యదర్శి హాఫీజున్ తదితరులు పాల్గొన్నారు వారికి ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందు ధన్యవాదాలు తెలియజేశారు.







## ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

### ఎంఈఓలు గిరిధర్‌శర్మ, శివ కోటేశ్వరరావు

**అక్షర టైమ్స్ రాచర్ల:** స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికల నిర్వహణకు పాఠశాలల సిబ్బంది సిద్ధంగా ఉండాలని మండల విద్యాశాఖ అధికారులు గిరిధర్‌శర్మ, శివ కోటేశ్వరరావులు అన్నారు. రాచర్లలోని ఎంఈఓ కార్యాలయంలో శనివారం ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణపై ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఎన్నికల నిర్వహణలో ఎలా నడుచుకోవాలో విధివిధానాల గురించి తెలియజేశారు. ఎన్నికలు సజావుగా, సక్రమంగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ఉపాధ్యాయులు లేవనెత్తిన పలు సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం యుడైస్ టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టం గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పాటు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.సుధాకర్‌రావు, కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రత్యేక అధికారి డి.మాల కొండమ్మ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టి.మేరీ కుమారి, ఎమ్మార్పీలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన విద్యాశాఖ అధికారులు

**అక్షర టైమ్స్ రాచర్ల:** రాచర్లలోని ఎస్పీజీ పాఠశాలను శనివారం మండల విద్యాశాఖ అధికారులు గిరిధర్‌శర్మ, శివ కోటేశ్వరరావులు తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు వెచ్చిస్తుందని, అన్ని మౌలిక వసతులు కల్పిస్తుందని, వివిధ రకాల పథకాలతో విద్యార్థుల సంక్షేమానికి, విద్యాభివృద్ధికి పాటుపడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యా బోధన ఉంటుందని, విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గుచూపే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని తెలిపారు. అనంతరం పాఠశాల పరిసరాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులు పక్కాగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.





## పొలంబడిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### వ్యవసాయాధికారి అబ్దుల్ రఫీక్

**అక్షర టైమ్స్, రాచర్ల:** తక్కువ పెట్టుబడుతే ఎక్కువ లాభాలు పొందేందుకు పొలంబడి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్ అన్నారు. మండలంలోని గంగంపల్లి గ్రామంలో శనివారం రైతులకు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందేలా, మిత్ర పురుగులను సంరక్షిస్తూ, రైతులు తాము పండించే పంటలలో నిష్ణాతులను చేయడమే పొలంబడి ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ముందుగా మట్టి నమూనాల ఆవశ్యకత గురించి రైతులకు వివరించారు. మట్టి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపి ఆ ఫలితాల ఆధారంగా ఎరువులు వాడినట్లయితే సాగులో ఖర్చు తగ్గడంతో పాటు నేల కూడా ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. కంది పంటలో విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. కందిలో కేజీ విత్తనానికి 8 గ్రాముల ట్రైకోడెర్మారిడో విత్తన శుద్ధిచేసి నట్లయితే ఎండు తెగులు, వేరు కుళ్లు తెగులు రాకుండా ఉంటుందన్నారు. అనంతరం విత్తన శుద్ధిచేసి రైతులకు చూపించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి.సంపత్ కుమార్, వ్యవసాయ గ్రామ సహాయకురాలు పి.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

## గిద్దలూరు సివిల్ జడ్జి ఓంకార్

**అక్షర టైమ్స్, గిద్దలూరు :** జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ అదేశాల మేరకు శనివారం మండలంలోని దిగువమెట్ట చెంచు కాలనీ స్కూల్‌లో కేవస్ పల్లి వైద్య సిబ్బంది సహకారంతో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గిరిజన మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కేవస్ పల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహం వలన బాలికలు చిన్న తనంలోనే గర్భం దాల్చి అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు. వివాహ వయస్సు రాకుండా బాలికలకు వివాహం చేయవద్దని సూచించారు. ప్రస్తుతం డెంగ్యూ, మలేరియా జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారని, వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల నుంచి ఆరోగ్య పరిరక్షణకు కాచి చల్లార్చిన నీరు మాత్రమే గిద్దలూరు ఈఓపీఆర్డీ జేసీ చెన్నారావు అన్నారు. గుండ్లకమ్మ రేంజ్ ఫారెస్ట్ డిప్యూటీ ఆఫీసర్ డి. వంశీకృష్ణ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ, కాచి చల్లార్చిన నీరు త్రాగితే సాధ్యమైనంత వరకు వ్యాధులు దరిచేరకుండా ఉంటాయని తెలిపారు. లాయర్ ఎం. పిచ్చయ్య యాదవ్ మాట్లాడుతూ పొలాలకు రక్షణగా కరెంటు తీగలు పెట్టినప్పుడు, ప్రాణహాని జరిగినా లేక అడవి జంతువుల వల్ల పంట నష్టం జరిగినా సంబంధిత అధికారులను పరిహారం కోరవచ్చునన్నారు. శ్రీశైలం ఐటీడీఏ ఏపీఓ సురేష్ కుమార్ మాట్లాడుతూ గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలని సూచించారు. గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ. ఓంకార్ మాట్లాడుతూ అందరికీ ఆధార్ కార్డులు, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. బాల్య వివాహాలు చేయవద్దన్నారు. గృహహింస చట్టం, భరణం, సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందుట గురించి తెలియజేశారు. న్యాయపరమైన సలహాలకు, ఉచిత న్యాయ సహాయం కోసం గిద్దలూరు కోర్టులోని మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చునని లేదా టోల్ ఫ్రీ నెంబర్ 15100కు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ సీసీ జి. రంగనాయకులు , కేవస్ పల్లి పంచాయతీ సెక్రటరీ జి.రాఘవరావు, డాక్టర్ వి. మహమ్మద్ జుబైర్, ఏఎస్సై రంగయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎస్‌కే ముంతాజ్, దిగువమెట్ట సర్పంచ్ బి.లోక్ నాయక్, న్యాయవాది ఎం.రంగారెడ్డి, బార్ అసోసియేషన్ ట్రెజరర్ రైడర్ బాబు, ఎం.ప్రభాకర్‌రెడ్డి, అద్దంకి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

# వయనాడ్ వరద బాధితులకు విరాళాల సేకరణ

**అక్షర టైమ్స్, గిద్దలూరు :** గత నెల 30వ తేదీ తెల్లవారుజామున కేరళ రాష్ట్రంలోని వయనాడ్ జిల్లాలో వరదల వల్ల కొండ చరియలు విరిగిపడి అనేక మంది మృతిచెందడంతో పాటు వేల సంఖ్యలో కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. వారిని ఆదుకునేందుకు శనివారం గిద్దలూరులోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ కేరళలో జరిగిన సంఘటన దురదృష్టకరమని, ఇటువంటి విపత్తులు ఏ రాష్ట్రంలో రాకూడదని కోరుకుంటున్నామన్నారు. ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో ఉందని, వారందరినీ ఆదుకునే విధంగా విరాళాలు సేకరిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించి బాధితులకు అండగా నిలవాలని కోరారు. అధ్యక్షులు కొమ్మునూరి అరుణ్, కార్యదర్శి బండ ఈశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టి.అంజన్ కుమార్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. మొత్తం రూ.6715లు విరాళాలు రాగా సీపీఐ (ఎం) పీపుల్స్ రిలీఫ్ ఫండ్ అకౌంట్ నెంబర్‌కి జమ చేయడం జరిగింది.




# తల్లి పాలు బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరం



## సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ సుమయ

**అక్షర టైమ్స్, గిద్దలూరు :** మండలంలో సంజీవరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దంతరపల్లె అంగన్వాడీ కేంద్రంలో శనివారం సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ సుమయ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమయ మాట్లాడుతూ బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలు చాలా ముఖ్యమని, బిడ్డకు మొదటి 6 నెలలు తల్లి పాలే సంపూర్ణ ఆహారమన్నారు. 6 నెలలు దాటిన తరువాత తల్లి పాలతోపాటు అనుబంధ ఆహారం కూడా ఇవ్వవచ్చుని తెలిపారు.తల్లిపాలు శిశువును న్యుమోనియా, అతిసార వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుంచి కాపాడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ శ్రీలక్ష్మి, ఎంపీహెచ్ఈఓ బాదరయ్య,ఏఎన్ఎం లక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.




# బాలికను తల్లిని చేసిన కేసులో.. ముగ్గురు అరెస్ట్

### వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్

**అక్షర టైమ్స్, ఒంగోలు :** కొత్తపట్నం మండలం పాదర్తి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ బాలిక ఇటీవల బాత్‌రూంలో బిడ్డను ప్రసవించిన సంగతి తెలిసిందే. పుట్టిన బిడ్డ మరణించగా, బాలికను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. బాలికది చీమకుర్తి మండలం కావడంతో అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. బాలికను గర్భవతిని చేసిన ముగ్గురు వ్యక్తులను శనివారం అరెస్టు చేశారు. ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ వివరాలు వెల్లడించారు. బాలికను మొదట ప్రేమ పేరుతో పి.సైదుబాబు అనే వ్యక్తి లొంగ దీసుకుని గర్భవతిని చేశాడని, ఈ విషయం తెలుసుకున్న ఎం.శ్రీనివాసరెడ్డి, సీహెచ్ వెంకటరెడ్డిలు బాలికను బ్లాక్‌మెయిల్ చేసి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారని తెలిపారు. ముగ్గురిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డి.నీలిమా వంశీలత పాల్గొన్నారు. ఇదిలా ఉంటే పాదర్తి కేజీబీవీలో నిర్లక్ష్యంగా ఉన్న ప్రత్యేకాధికారి వి.అరుణకుమారి, ఏఎన్ఎం జె.సత్యవతిలను కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ సుభద్ర ఉద్యోగాల నుంచి తొలగించారు.


# మా గ్రామాలకు ఆర్టీసీ బస్సు వచ్చేలా చూడండి

### ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌కు వినతి



**అక్షర టైమ్స్, ఒంగోలు :** సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్‌ను శనివారం ఒంగోలులోని మంగమూరు రోడ్డులో గల ఆయన నివాసంలో ఏలూరివారిపాలెం, కొనగానివారిపాలెం, పి.గుడిపాడు గ్రామస్తులు కలిశారు. తమ గ్రామాలకు ఆర్టీసీ బస్సు రాకపోవటం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, మా గ్రామాల మీదుగా బస్సును ఏర్పాటుచేయాలని కోరారు. ఎమ్మెల్యే తక్షణమే ఆర్టీసీ అధికారులతో మాట్లాడ బస్సు ఏర్పాటుచేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గోగినేని రాజా, నాదెండ్ల ఆంజనేయులు, సుబ్బారావు, శ్రీనివాసరావు, సాహితి తదితరులు పాల్గొన్నారు.

# ఓణీల వేడుకకు హాజరైన ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్



**అక్షర టైమ్స్, చీమకుర్తి :** మండలంలోని కేవీ పాలెం గ్రామంలో శనివారం పడిదపు కొండయ్య కుమార్తె ఓణీల వేడుక జరుగగా సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం గ్రామంలో అనారోగ్యం కారణంతో మరణించిన పంగులూరి శ్రీరాములు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పుట్టా బ్రహ్మయ్య, జనసేన నాయకులు పల్లపు శివ, తాతినేని రాము, పడిదపు ప్రసాద్, వాసు ఉన్నారు.

